ఎన్నికల నోటిఫికేషన్‌తో స్పందన రద్దు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కేంద్ర ఎన్నికల కమిషన్ 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల, గ్రామ, సచివాలయ స్థాయిల్లో ప్రజల నుంచి అర్జీలని స్వీకరించే స్పందన నిర్వహించడం జరగని దృష్ట్యా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

వసతి గృహ వార్డెన్లకు బిల్లుల వాత

- హాస్టల్ నిర్వహణకు పాట్లు
- అప్పులు చేసి నిర్వహణ
- ఆందోళనలో హాస్టల్ వార్డెన్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వార్డెన్లకు హాస్టల్ బిల్లులు కొండలా పేరుకు పోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సక్షేమ హాస్టళ్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవటమే ఈ దుస్థితికి కారణం. తాజాగా విద్యా సంవత్సరం తుది దశకు వచ్చినా బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. జిల్లాలో నెల తరబడి బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిలపై అధికారులు సైతం స్పష్టమైన సమాధానం చెప్పడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిపి 35 హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో 2,330 మంది విద్యార్థులు వసతి సౌకర్యం పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రి మెట్రిక్ హాస్టళ్లకు మూడు, నాలుగో తరగతి వరకు విద్యార్థికి రూ.11,50, 5 నుంచి 10వ తరగతులకు రూ.1400 మెస్ ఛార్జీల రూపంలో చెల్లిస్తున్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లో అక్టోబరు అనంతరం బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక వైపు సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడం మరో వైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో ఈ ఛార్జీలు చాలడం లేదని వసతి గృహాల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక హాస్టల్లో 110 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి నెల రూ.80,000 బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా నిధులు విడుదల చేయలేదు. అప్పు చేసి హాస్టల్లో విద్యార్థులకు భోజనం పెడుతున్నామని అక్కడి సిబ్బంది వాపోయారు. మరోవైపు సాంకేతిక సమస్యలు గోరు చుట్టుపై రోకలి పోటులా మారుతున్నాయి ఫింగర్ ప్రింట్ పడకపోవటం, మ్యాపింగ్, కోడ్ సమస్యలు వెంటాడుతున్నాయి. మరోవైపు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. గతేడాది కేజీ కందిపప్పు ధర రూ.110 కాగా ప్రస్తుతం రూ.160కు చేరింది. లీటరు రూ.69 ఉండే పామాయిల్ రూ.90కి చేరింది, చింతపండు రూ.99 నుంచి 180కి, పెసరపప్పు రూ.80 నుంచి రూ.140కు చేరింది. గ్యాస్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.930కి చేరింది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచాలని వార్డెన్లు కోరుతున్నారు. బిల్లులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరంలో ఒక ఎస్‌సి హాస్టల్ వార్డెన్ మూడు నెలలుగా అప్పులు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. ఒక నెల రూ.4, రెండు నెలలు రూ.5 వడ్డీకి రూ.4 లక్షలు అప్పు చేశారు. ఈ నెల అప్పుకోసం వెళితే.. రుణదాత 'ముందు ఇచ్చిన అప్పు చెల్లించిన తరువాత కొత్త అప్పు ఇస్తా'నని చెప్పారని ఆ వార్డెన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల ముగిస్తే ఇంట్లో బంగారం, వస్తువులు అమ్మి విద్యార్థులకు భోజనం పెట్టాల్సి వస్తుందని వాపోయాడు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే ధరకు.. బయట మార్కెట్లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలుపోవడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉన్నతాధికారులు ఎక్కడ బాధ్యులు చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. 2021తో పోల్చితే గడిచిన రెండేళ్లలో ధరలు గణనీయంగా పెరిగాయి. అప్పటి ధరలకు అనుగుణంగా భోజనం అందించడం సాధ్యమా? అని వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

ఈ నెలాఖరులోపు బిల్లులు జమం

ఈ నెలాఖరులోపు బిల్లులు జమ అవుతాయి. కాస్మోటిక్ ఛార్జీలు, డైట్ ఛార్జీలు ముందుగా చెల్లించేలా చర్యలు తీసుకున్నాము. ఒకో హాస్టల్‌కు ఒకో విధంగా ఈ నెలాఖరులకు బిల్లులు జమ అవుతాయి.

- ఎం.సందీప్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి.

ఎన్నికల నియమావళిపై సిఇసి సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎపి ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో ఆదివారం వెలగపూడి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి (డిఇఒ) నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ద్వారా ఎన్నికలను నిర్వహించే తేదీలను ప్రకటించిన నేపథ్యంలో అందరూ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని తెలిపారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు తొలగించని విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. తక్షణం స్పందించి చర్యలపై నివేదికలు పంపాలని ఆదేశించారు. అలసత్వం వహించకుండా ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, ఇతర బృందాలు కార్యాచరణలోకి రావాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు, ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ పూర్తి స్థాయిలో విధుల్లో భాగస్వామ్యం అవ్వడం, పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో తనిఖీల కోసం క్షేత్ర స్థాయిలో బాధ్యతలు నిర్వహించే ఎఫ్ఎస్, ఎంసిసి తదితర బృందాల్లో సిబ్బందికి మేజిస్ట్రీరియల్ అధికరణల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సీ విజిల్ ద్వారా అందిన ఫిర్యాదు యొక్క స్థితిని ఫిర్యాదుదారుకు తెలియజేయడానికి నిర్ణీత వ్యవధిలో 100 నిమిషాల్లో ప్రతిస్పందన ఉండాలన్నారు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు అందించిన వ్యక్తి వివరాలూ, ఎక్కడ నుంచి సంభందిత సమాచారం మీకు అందుబాటులో ఉంటాయని, అక్కడికి సంభందిత ఎఫ్‌యు (ఫంక్షనరీ యూనిట్) చేరుకుని స్పందించి యాప్ ద్వారా తదుపరి నివేదికను సమర్పించాలన్నారు. వీటిలో బృందం పేరు, ఫిర్యాదు తేదీ, సమయం, స్థానం, స్థితి, ఫిర్యాదు రకం, తేదీ, నివేదిక సమయం, సమగ్ర సమాచారం నమోదవుతాయన్నారు. వివిధ పత్రికల్లో, మాధ్యమాల్లో వచ్చే వార్తల విషయంలో 24 గంటల్లోగా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పర్యవేక్షణ బాధ్యతల్లో భాగంగా ఫిర్యాదు నిర్వహణ అప్లికేషన్, యదార్థ స్థితిపై నివేదికను జత చేయాలన్నారు. జిల్లా ఎన్నికల నిర్వహణా వ్యవస్థ తరహాలో నియోజకవర్గ స్థాయిలో కూడా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎంసిసిల నిర్వహణపై రోజువారీ నివేదికలు, నిర్ణీత పట్టికల్లో సమగ్ర సమాచారం ఎప్పటి కప్పుడు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నియోజక వర్గాలవారీగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు తదితర వివరాలకు చెందిన పెండింగ్ పనులు పూర్తి చేసి, సంపూర్ణ నివేదిక కమిషన్ వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డిఆర్‌ఒ జి.నరసింహులు, ఇఆర్‌ఒ ఆర్.కృష్ణా నాయక్, డిటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా విద్యా శాఖ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లావ్యాప్తంగా 30,116 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో బాలురు 15,819 మంది కాగా బాలికలు 14,297 మంది ఉన్నారు. వీరిలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థినీ విద్యార్థులు 29,990 మంది కాగా ఒక ఎస్ఎస్‌సి ప్రైవేట్ విద్యార్థినీ విద్యార్థులు 126 మంది ఉన్నారు. పరీక్షల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతున్నాయి. విద్యార్థులను 8.45కు గంటలకు కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదని ఇప్పటికే అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. జిల్లాలో 5 సమస్యాత్మక కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దష్టిపెట్టారు. పోలీసు విభాగం సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. వికలాంగులకు అవసరమైతే స్క్రయిబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి పరీక్షల నేపథ్యంలో కొంతకాలంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ప్రతి రోజూ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఆందోళన తొలగించేందుకు విద్యాశాఖ కసరత్తు చేసింది.

ప్రశాంతంగా గ్రూప్ 1 పరీక్షలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

జిల్లా పరిధిలో 25 పరీక్షా కేంద్రాల్లో ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు జెసి, నోడల్ అధికారి ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ఆదివారం ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాలను జెసి తనిఖీ చేశారు. డిఆర్‌ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్ 1 పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహించినట్టు జెసి తెలిపారు. 8,258 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా పేపర్ 1కి ఉదయం 5,056 మంది అభ్యర్థులు హాజరు కాగా 3,202 మంది గైర్హాజరయ్యారు. పేపర్-2కు 5,007 మంది హాజరు కాగా 3,251 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పరీక్షలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

హెచ్‌ఎం రత్నకుమారికి ఘన సన్మానం

ప్రజాశక్తి-గోపాలపురం

జాతీయ స్థాయిలో ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపికైన గోపాలపురం ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం ఎస్.సిహెచ్ రత్నకుమారిని దక్షిణ కొరియాకు చెందిన ఆశ్రా సంస్థ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో ఎంపికైన మహిళలను వారు ఇటీవల ఘనంగా సన్మానించి అవార్డు అందించినట్లు రత్నకుమారి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు జి.శ్రీనివాసరావు, ఆకుల మహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జానుబాబు, వెంకటేశ్వరరావు, జి.సుబ్రహ్మణ్యం, టివి.సత్యనారాయణ, కాకి పోసియ్య, నారాయణమ్మ, గణేష్, టి.పోషేరావు, కాకి సిరమయ్య, బోడా వెంకటలక్ష్మి జయ కుమారి, సిఆర్‌పి కొయ్య నాగరాజు, పీతల జయ రమణ, ఇస్సాపూరి కృష్ణయ్య, పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

రత్నకుమారిని సన్మానిస్తున్న ఆశ్రా సభ్యులు

మండల కేంద్రంలో ఉన్న ఫ్లెక్సీలు

కోడ్ ఉన్నా చలించని యంత్రాంగం

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎన్నికల కోడ్ ఉన్నా మండలంలో యంత్రాంగం స్పందించడం లేదు. మండల కేంద్రమైన దేవరపల్లిలో బస్టాండ్, మూడురోడ్ల కూడళ్ల వద్ద, పలు గ్రామాల్లో పలుచోట్ల ఉన్న ఉన్న వైసిపి, టిడిపి, జనసేన ఫ్లెక్సీలు అధికార సిబ్బంది తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

సభకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-చాగల్లు

ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలు తెలుగుదేశం ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగణం సభకు మండలం నుండి టిడిపి శ్రేణులు ఉత్సాహంగా తరలి వెళ్లారు. స్థానిక సెంటర్ నుండి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నందిగాం శ్రీను,. ఆ పార్టీ నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తాలూరి హరిచంద్ర ప్రసాద్, ఈడుపుగంటి మురళి, సుబ్బారావు, శ్రీనివాసు, మాజీ సర్పంచులు జొన్నకూటి వెంకయ్యమ్మ, ఊబా దుర్గ, టిడిపి నాయకులు ఎమ్‌డి అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

సిఎఎకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు కోసం నిబంధనలు ప్రకటించటాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు విజ్ఞప్తి చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన, దేశ సమైక్యతకు ప్రమాదకరమైన, ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని నోటిఫై చేసిన సిఎఎ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ముద్రించిన కరపత్రాలను ఆదివారం వేలివెన్ను, ఉండ్రాజవరం గ్రామాల్లో ముస్లిం మైనార్టీలకు విస్తతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జువ్వల రాంబాబు మాట్లాడుతూ 2019లో ప్రవేశపెట్టబడిన సిఎఎ చట్టాన్ని ప్రజాందోళనల వల్ల ఐదేళ్ళు మూలన పెట్టి ఎన్నికల సమయంలో ప్రయోజనం పొందేందుకు బిజెపి ప్రభుత్వం ఆడుతున్న ప్రమాదకరమైన నాటకమన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలో ఉద్రిక్తతలు ఏర్పడతాయి, రాష్ట్రంలో అశాంతి నెలకొంటుందని రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను మతాలవారీగా విడ గొడుతుందన్నారు. 140 కోట్ల మంది భారతీయులు తాము భారత పౌరులం అని నిరూపించు కోవాలనడం చాలా అన్యాయమన్నారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు సిఎఎను వ్యతిరేకించారన్నారు. చంద్రబాబు సిఎఎకు వత్తాసు పలకడం ముస్లిం మైనార్టీల పట్ల చంద్రబాబు ద్వేషం బయట పడిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా నోరు మెదపక పోవడంతో దీన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, బాషా, వలీ షాజహాన్, సయ్యద్ అహ్మద్, నిసార్ ఖాన్, షాహి పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు

పది పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ అనుమానాలు

ప్రజాశక్తి-కడియం

మండలంలో పదో తరగతి పరీక్షలు గత దశాబ్ద కాలంగా చూసుకో రాసుకో అన్న విధంగా సాగుతున్న ఏ అధికారీ కట్టడి చేసిన పాపాన పోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇక్కడ పబ్లిక్ పరీక్షలు ప్రైవేట్ విద్యాసంస్థల కనుసన్నల్లో నడుస్తున్నాయన్న అనుమానం కలుగుతోందంటున్నారు కడియపులంక వాసులు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ నుంచి 1,019 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కడియం హైస్కూల్లో 300 మంది, వేమగిరిలో 102 మంది, కొత్తగా పరీక్షా కేంద్రం మంజూరైన జేగురుపాడులో 200 మంది, వీరవరంలో 140 మంది, మురమండలో 185 మంది, కడియపు లంకలో 138 మంది పరీక్షలు రాస్తున్నారు. కొన్నేళ్లుగా కడియం సెంటర్‌పై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయని, 138 మంది పరీక్షలు రాస్తున్న కడియపులంకలో సిసి కెమేరాలు ఏర్పాటు చేయడం ఏమిటని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కడియం సెంటర్లో ఏర్పాటు చేయవలసిన సిసి కెమేరాలను తమ ఊర్లో ఏర్పాటు చేశారని, ఈ సంవత్సరం కడియం, జేగురుపాడు సెంటర్లలో ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని, ఈ కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు. ఈ తతంగం విద్యాశాఖాధికారుల ఆశీస్సులతోనే జరిగేదని పలువురు తల్లిదండ్రులు అంటున్నారు. ఏ ప్రాతిపదికన తమ కడియపులంక పాఠశాలలో సిసి కెమెరాలు గత సంవత్సరమే కాక ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేస్తున్నారో వివరణ ఇవ్వాలని కడియపులంక ప్రజలు కోరుతున్నారు.

పోలీసు బలగాల కవాతు

పోలీస్ బలగాల కవాతు

ప్రజాశక్తి- సీతానగరం

ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మండలంలో పోలీస్ బలగాలు ఆదివారం కవాతు నిర్వహించారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరంలో ఎన్నికల నేపథ్యంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ బలగాలతో నిర్వహించారు. ఎస్ఐ రామర్కృష్ణ మాట్లాడుతూ ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు ఉపయోగించుకోవడానికి, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించడానికి పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని పిలుపు నిచ్చారు. పోలీసు వ్యవస్థ ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 82 మంది పారామిలిటరీ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

వైద్యులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆర్థోపెడిక్ వైద్యులంతా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకోవాలని పలువురు ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్యాపురంలోనిసాయి హాస్పిటల్స్ కాన్ఫరెన్స్ హాలులో రాజమండ్రి ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరి ఆర్థోప్లాస్టీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎముకలు, కీళ్ల వైద్యంలో వస్తున్న వివిధ మార్పులు, వాటికి అనుగుణంగా అనుసరించాల్సిన వైద్య విధానాలపై జాతీయ స్థాయిలోని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు దిశానిర్ధేశం చేశారు. కోయంబత్తూరుకు చెందిన గంగా హాస్పిటల్ వైద్య నిపుణుడు డాక్టర్ ధనశేఖర్ రాజా సదస్సులో మాట్లాడుతూ తాను అందించిన వైద్య సేవలు, చేసిన సర్జరీల్లో తనకు ఎదురైన కొన్ని అనుభవాలను వివరించారు. కొన్నిసార్లు సంక్లిష్టమైన పరిస్థితులు ఏర్పడినపుడు ఎలా అధిగమించాలో ఆర్థోపెడిక్ సర్జన్లకు వివరించారు. వెలిస్ రోబోతో మోకాలు మార్పిడి ఆపరేషన్ చేసి, కాన్ఫరెన్స్ హాల్లోని ఆర్థోపెడిక్ సర్జన్లకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. సర్జరీని ప్రత్యక్షప్రసారంలో చూస్తున్నపుడు, ధనశేఖర్ రాజాతో కాన్ఫరెన్స్ హాలు నుంచి కొంత మంది ఆర్థోపెడిక్ సర్జన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మోకాలు మార్పిడి సర్జరీలో మోకీళ్లను జాగ్రత్తలను డాక్టర్ ఆదిత్య కృష్ణ వివరించారు. గోదావరి జిల్లాల్లో ప్రముఖ తొలి రోబోటిక్ మోకాలు మార్పిడి సర్జన్ డాక్టర్ విజయకుమార్ మోకాలు మార్పిడి సర్జరీలో అనుసరించాల్సిన ప్రాథమిక అంశాలను వివరించారు. తుంటి మార్పిడి సర్జరీని కూడా సదస్సులో ప్రత్యక్ష ప్రసారం చేసారు. డాక్టర్ జె వి శ్రీనివాస్ ఈ సర్జరీ నిర్వహించారు. తుంటి మార్పిడికి ఇంప్లాంట్ ఎలా ఎంపిక చేసుకోవాలో డాక్టర్ నాగేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కె.విజయకుమార్, డాక్టర్ రత్నాకరరావు, డాక్టర్ ఆనంద్ చౌదరి, డాక్టర్ విఠల్ కుమార్, విఠల్ బాబు, డాక్టర్ కె.రఘు, డాక్టర్ ఎ.రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

మోడీ వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-కడియం

చిలకలూరిపేట బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలు అర్ధరహితమని ఐఎన్‌టియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెటి.రామారావు ఖండించారు. రాష్ట్రానికి వచ్చిన మోడీ సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డిని ఒక్క మాట అనలేదన్నారు. బిజెపి, వైసిపి మధ్యే లోపాయకారీ ఒప్పందాలు ఉన్నాయే గాని, కాంగ్రెస్, వైసిపి మధ్య ఎలాంటి రహస్య ఒప్పందాలూ లేవన్నారు. వారి రహస్య ఒప్పందాల కారణంగానే పార్లమెంట్‌లో 30కి పైగా బిల్లులపై ఓటింగ్ సమయంలో జగన్ ఆదేశాలతో వైసిపి ఎంపీలు మద్దతు పలికారని చెప్పారు. వారి మధ్యే క్విడ్‌ప్రోకో ఉందన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, చాగల్లు

మండలంలో సోమవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఇఒ సిహెచ్.సక్సేనా రాజు ఆదివారం తెలిపారు. మండలంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మొత్తం 1,190 మంది ఉండగా, ఐదు సెంటర్లలో పరీక్షలు నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎ, బి సెంటర్లు, వేలివెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేలివెన్ను శశి ఇంగ్లీష్ మీడియం, అన్నపూర్ణ విద్యానికేతన్‌లో పదో తరగతి పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేయగా, 28వ తేదీకి పరీక్షలు పూర్తవుతాయని ఎంఇఒ తెలిపారు.

చాగల్లు మండలంలో మొత్తం 506 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్టు ఎంఇఒలు వి.ఖాదర్ బాబు, సిహెచ్.సుధాకర్ తెలిపారు. వీరిలో 246 మంది బాలురు, 260 మంది బాలికలు ఉన్నట్టు తెలిపారు. ఏడు ప్రైవేటు స్కూళ్లలో 107 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు చెప్పారు.

జగన్ కోసం వికలాంగుల ప్రార్థనలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

గౌరీపట్నం మేరీమాత దేవాలయం వద్ద వికలాంగుల సంఘం అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ ఆధ్వర్యంలో జగన్ సిఎం అవ్వాలని, వైసిపి రాజమండ్రి రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ మంచి మెజారిటీతో గెలవాలని ఆదివారం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వికలాంగుల సంఘం అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ మాట్లాడుతూ 2024లో జగనన్న మరోసారి గెలుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.విజయ దుర్గ, రెడ్డి, కెవిఆర్.సాగర్, రజిని కుమార్, పుష్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్ని కోర్సులున్నా చివరికి

ఈ కోర్సులు తప్పడం లేదురా..!!

ఫైవ్ స్టార్ రేటింగ్ ఉపకరణాలు వాడాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వేసవికాలాన్ని దష్టిలో పెట్టుకుని వినియోగదారులకు మోర్త సెక్షన్ విద్యుత్ శాఖ ఎఇ నిడదవోలు దొరబాబు పలు సూచనలు చేశారు. వేసవిలో విద్యుత్ సరఫరా సమస్య నుండి దూరమయ్యేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ బిజిలి యోజన పథకంలో భాగంగా ప్రతి ఒక్క వినియోగదారుడు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న సోలార్ సిస్టం అమర్చుకోవాలన్నారు. సోలార్ సిస్టం వాడకం వల్ల 1 కెవి, 2 కెవి లోడ్ వినియోగంపై సగానికి సగం సబ్సిడీ పొందవచ్చన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం ఒత్తిడిని గ్రహించి, మండలంలోని అనేక గ్రామాల్లో సింగిల్ ఫేస్ ఉన్న చోట త్రీఫేస్ కన్వర్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహోపకరణాల వాడకం ఎక్కువగా ఉన్నచోట లోడ్ పెంచుకునే సౌకర్యాన్ని కూడా వినియోగదారులకు కల్పిస్తున్నామన్నారు. సాధ్యమైనంత వరకు గృహ విద్యుత్ వినియోగదారులు ఎలక్ట్రానిక్ గృహోపకరణాలపై ఫైవ్ స్టార్ రేటింగ్ ఉన్న వస్తువులు, ఎల్ఇడి బల్బులు వాడాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ముఖ్యంగా రైతులకు మెరుగైన సరఫరా ఇవ్వగలుగుతున్నామన్నారు. ఈ ఏడాది 25 సర్వీసులకు పైగా కొత్త వ్యవసాయ కనెక్షన్స్ ఇచ్చామన్నారు. వినియోగదారులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నీ సకాలంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట జెఇ ఎంఎస్.సుమన్ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

-ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం మోటార్ సైకిళ్ళను వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా నలుగురు గాయాల పాలయ్యారు. ఈ మేరకు ప్రతిపాడు ఎస్ఐ ఎం పవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని ఉత్తర కంచికి చెందిన తాడి గంగాధర్(29) సోదరుడు తాడి రాజేష్, గుడాల సురేష్ ప్రత్తిపాడు వచ్చే నేపథ్యంలో హైవేపై మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. వీరి వెనక గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన సోదరులు ములికి సత్యనారాయణ, ములికి ఉమాశంకర్‌లు మరో బైకుపై వస్తున్నారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి రెండు మోటర్ బైక్ లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించి తాడి గంగాధర్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం యండగండిలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు చేశామని ఎస్ఐ జానీ భాషా తెలిపారు. మద్యం విక్రయిస్తున్నారని సమాచారంతో యండగండి గ్రామ శివారు పొలాల వద్ద యండగండికి చెందిన కడలి శ్రీనివాసు యానంకి చెందిన వివిధ కంపెనీలకు చెందిన 14 మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - కడియం

పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ టి.కృష్ణసాయి, సిబ్బందితో కడియం గ్రామ శివారు సంగీత నర్సరీ మొక్కల్లో పేకాడుతుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,140 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

కోడ్ కూసింది.. ఫ్లెక్సీ ఊడింది..

గోపాలపురంలో విగ్రహానికి ముసుగు తొడిగిన సిబ్బంది

ప్రజాశక్తి- యంత్రాంగం

పెరవలి సార్వత్రిక ఎన్నికల గంట మోగడంతో అధికార యంత్రాంగం రాజకీయ పార్టీలు సంబరానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గత నెల రోజుల నుంచి అధికార యంత్రాంగం ఎన్నికల సంబంధించిన ఏర్పాటులో నిమగ్నమయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల తేదీ ఖరారు చేయడంతో మరింత అప్రమత్తమయ్యారు. నియోజక వర్గ పరిధిలో సౌకర్యాలపరంగా లోటు పాట్ల వైపు ప్రత్యేక దృష్టి పెట్టారు. మరొకపక్క తుది ఓటర్ల జాబితాపై కసరత్తు కొనసాగుతోంది. నియోజవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు బ్యానర్లు పోస్టర్లు 24 గంటల్లోపు స్వచ్ఛందంగా తొలగించాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు వాటిని స్వచ్ఛంగా తొలగించి జాగ్రత్త చేసుకున్నారు. మున్సిపాలిటీ మండల స్థాయి, గ్రామస్థాయిలో కోడ్ ఉల్లంఘనకు అవకాశం లేకుండా పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ స్థానిక మహిళా పోలీసులతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకులు ఫ్లెక్సీల తొలగింపు రాజకీయ, జాతి నాయకులు విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు.

చాగల్లు ఎన్నికల గంట మోగడంతో అధికార యంత్రాంగం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు 24 గంటల్లోపు స్వచ్ఛందంగా తొలగించాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు వాటిని స్వచ్ఛంగా తొలగించి జాగ్రత్త చేసుకున్నారు. మున్సిపాలిటీ మండల స్థాయి గ్రామస్థాయిలో కోడ్ ఉల్లంఘనకు అవకాశం లేకుండా పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ స్థానిక మహిళా పోలీసులతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకులు ఫ్లెక్సీల తొలగింపు రాజకీయ జాతి నాయకులు విగ్రహాలకు ముసుకులు వేస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇప్పటికే మండల స్థాయిలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక దళాలతో కవాతు నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఊహలకు పదులు పెడుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నిత్యం ప్రజలలో ఉండేలా ప్రణాళికలు రూపొం దిస్తున్నారు

గోపాలపురం రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ మేరకు 24 గంటలు లోపే బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లలో విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ బస్సులు, రోడ్డు, వంతెనలు, ప్రభుత్వ కార్యాలయాలు, మండల పరిధిలో ఉన్న అన్ని రకాల రాజకీయ పరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు, తొలగింపుకు చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్ అమలు జరుగుతోంది. సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్సు బలగాలతో మండలంలోని చివటం, పాలంగి, కె.సావరం, ఉండ్రాజవరం గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.అప్పలరాజు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, తమ ఓటు హక్కు ఉపయోగించుకోవచ్చునని, ఎన్నికల వేళ ఎటువంటి అసాంఘిక చర్యలు, అవాంఛిత సంఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించ డానికి పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాక తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ముందస్తుగా కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట

అర్బన్ నియోజకవర్గ పరిధిలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్ పర్యవేక్షణలో సిబ్బంది డివిజన్ల వారీగా గోడలపై ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియను నగర పరిధిలో మూడు ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.

సామర్లకోటలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌కు సంబంధించిన బృందాలు జోక్యం చేసుకుని ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. ఈ సందర్భంగా డిసిపి హరిదాసు మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో చాలావరకు ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌ను తొలగించామని, జాతీయ నాయకుల విగ్రహాలు మినహా రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన విగ్రహాలకు మాస్కులు వేస్తున్నామన్నారు. నగర పరిధిలో సుమారు 40 నుంచి 50 వరకు విగ్రహాలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు కూడా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయడంలో సహకరించాలని కోరారు. అలాగే సామర్లకోట పట్టణంలోని పలు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. పట్టణంలో విద్యుత్, టెలిఫోన్ స్తంభాలతోపాటు, ప్రభుత్వ స్థలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలు ఎలక్షన్ కోడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ఫ్లెక్సీలను ఆయా రాజకీయ పార్టీలకు చెందిన వారే స్వచ్ఛంధంగా తొలగించాలని సూచించారు.

కాకినాడలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

డాక్టర్ తరపట్లకు సాహితీ పురస్కారం

నన్నయ విసి, రిజిస్ట్రార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న తరపట్ల సత్యనారాయణ

ప్రజాశక్తి - రాజానగరం

కుసుమ ధర్మన్న జయం తోత్సవ వేడుకల్లో నన్నయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ తరపట్లకు సాహితీ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని యూని వర్శిటీ విసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్యజి.సుధాకర్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ రాధా కుసుమ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టర్. ఆచార్య. పి.వరప్రసాద్ మూర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు విస్లాలి శంకర్, ఆంధ్ర విశ్వ విద్యాలయ ఆచార్యులు.డాక్టర్ బి.వెంకటస్వామి.పాల్గొన్నారు.

స్నేహితుని జ్ఞాపకార్థం సేవలు

ప్రజాశక్తి - సామర్లకోట

మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన స్నేహితుడు జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు ఓ స్నేహితుడు. మండలం లోని వెదురుపాక శివ, సామర్లకోటకు చెందిన లంక శ్రీనివాసు మంచి స్నేహితులు. గత 3 సవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో లంక శ్రీనివాసు మృతి చెందాడు. తీవ్ర భావోద్వేగానికి గురైన శివ తన స్నేహితుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయించుకుని గత రెండేళ్లుగా స్నేహితుని పుట్టిన రోజున పలువురికి నిత్యవసర సరుకులు అందించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు 26 కేజీల బియ్యం బస్తాను అందచేశారు. శివ చేస్తున్న సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

వృద్ధిరాలికి బియ్యం, నిత్యవసర సరుకులు అందిస్తున్న మిత్రులు

ఘనంగా పోలేరమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు గ్రామ దేవత పోలేరమ్మ 18వ ఆలయ వార్షికోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అనంతరం అనేకమంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు భక్తి, శ్రద్ధలతో చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వందలాదిమందికి అన్న ప్రసాద వితరణ చేశారు. పోలేకురు, తోటపేట, తాళ్ళరేవు, పి. మల్లవరం, పత్తిగొంది, సుంకటరేవు, యానం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మురమళ్ళ భజన బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

సుబ్బరాజు, హరీష్‌ల గెలుపు అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఎగా దాట్ల సుబ్బరాజు, ఎంపీగా గంటి హరీష్ మాధుర్‌లు గెలుపు అవసరమని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అన్నారు. ఆదివారం తాళ్లరేవులో టిడిపి గ్రామ అధ్యక్షుడు కుడిపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుబ్బరాజు, హరీష్ మాధూర్‌లను గెలిపించాలని కోరారు. చంద్రబాబును సిఎంగా చేసుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోళ్ళ చక్రవర్తి, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, మేడిశెట్టి సత్తిబాబు, కుడిపూడి దుర్గా ప్రసాద్, బండారు శ్రీను, వాకపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాష్

వైసిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పార్టీ విజయానికి కృషి చేయాలని వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. కె. గంగవరం మండలంలో పార్టీ విస్తత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చమని మీకు మంచి జరిగితేనే పార్టీకి ఓటు వేయాలని గ్రామస్థాయిలో ఓటర్ లకు తెలియజేయాలన్నారు. వచ్చే పార్టీల అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని ప్రజలు గమనిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో.మండల పార్టీ అధ్యక్షులు పెట్టా శ్రీనివాస్, ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, మండల సచివాలయ కన్వీనర్ తోకల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు జుత్తుక శ్యాం ప్రసాద్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నూకాంబిక జాతరపై సమీక్ష

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆర్‌డిఒ ఎం.ముక్కంటి ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు జాతరపై సమీక్ష నిర్వహించనున్నారని ఆలయ ఇఒ ఎం.శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సమీక్షలో అన్ని శాఖల అధికారులు పాల్గొని సహకరించాలన్నారు. అలాగే గ్రామస్తులు, పాత్రికేయులు విచ్చేసి తమ తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్ ఉన్నారు.

శివరామకృష్ణ, ఇఒ

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తపేట

అనకాపల్లిలో ఈనెల 25 నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తొమ్మిది మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని యోగా గురువు రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ జడ్జి మోటూరు భైరవ స్వామి ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద యోగా ఆశ్రమం యోగా గురువు వాడపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యోగా శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందుతున్నారని అన్నారు. అమలాపురం కామాక్షి పీఠంలో ఫిబ్రవరి 10న జరిగిన యోగా పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి లో ఈ నెల 25న ఈ విద్యార్థులను యోగా గురువు శ్రీనివాస్ తీసుకు వెళ _న్నారని అన్నారు. విద్యార్థులను బండారు సందీప్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం శ్రీ ఘూకోళ్ళపు వీరబాబు అభినందించారు.

ఎన్నికల్లో పోటీకి సిద్ధం

కాంగ్రెస్ పార్టీ నేత దేవరపల్లి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం ఇస్తే అమలాపురం ఎంపీ అభ్యర్థిగా గాని, అసెంబ్లీ అభ్యర్థిగా గాని ఎన్నికల బరిలో దిగటానికి సిద్ధంగా ఉన్నానని న్యాయవాది దేవరపల్లి రాజేంద్ర బాబు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా బయోడేటాని పార్టీ పెద్దలకు తెలియజేశానని తెలిపారు. రాజకీయ కుటుంబానికి చెందిన తాను లా అభ్యసించిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో వివిధ బాధ్యతలు స్వీకరించానని అన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే గెలిచే అవకాశం ఉందని దేవరపల్లి రాజేంద్ర బాబు తెలిపారు.

వైసిపి రాష్ట్ర కమిటీలో 8 మందికి పదవులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వైసిపి రాష్ట్ర కమిటీలో డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎనిమిది మంది నేతలకు పదవులు దక్కాయి.వీరిలో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా అమలాపురం పట్టణం నుంచి చెల్లుబోయిన శ్రీను వాసరావు, బండారులంక గ్రామానికి చెందిన ఆ గ్రామ ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీల్లో ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వీరు ఇప్పటి వరకూ పార్టీలో వివిధ పదవులు నిర్వహిస్తున్నారు. వీరు ఆదివారం రాష్ట్ర రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్ ను బట్నవెల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ కామిశెట్టి శ్రీనివాసరావును అభినందించి ఘనంగా సత్కరించారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషిచేస్తామని కొత్తగా పదవులు పొందిన నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బండారులంక గ్రామానికి చెందిన వైసిపి నాయకలు హాజరయ్యారు.

భిన్నంగా 'అవును నిజమే' చిత్రం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సత్య శ్రీ క్రియేషన్ బ్యానర్ పై తీస్తున్న అవును నిజమే సినిమా అన్ని సినిమాలకన్నా భిన్నంగా హాస్య భరితంగా ఉంటుందని చిత్ర నిర్మాత వరసాల సత్యనారాయణ తెలిపారు. చల్లపల్లి పంచాయతీ చింతల చెరువుకు చెందిన చిత్ర నిర్మాత సత్యనారాయణ ఆదివారం ఆయన స్వగృహం వద్ద చిత్ర యూనిట్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సినిమా హైదరాబాద్, కాకినాడ, ఫ్రెంచ్ యానాం, అమలాపురం పరిసర ప్రాంతాల్లో షఉటింగ్ తీయడం జరిగిందని తెలిపారు. చిత్రంలో నూతన నటీనటులు హీరో వివిఎస్‌ఎన్, హీరోయిన్ అనూష లతోపాటు జబర్దస్త్ టీం కూడా నటిస్తున్నారని తెలిపారు. చిత్రానికి దర్శకత్వం గూన అప్పారావు, కెమెరామెన్ వెంకటాద్రి నాయుడు, సంగీతం రాజేష్, కొరియోగ్రఫీ బండ్ల రామారావు, పాటలు పవన్ శంకర్ రచించారని తెలిపారు. మే నెలలో సినిమా విడుదలకు సన్న హాలు చేస్తున్నామని సత్యనారాయణ తెలిపారు.

మాట్లాడుతున్న నిర్మాత సత్యనారాయణ

ఘనంగా స్వర్ణ శిఖర ప్రతిష్ట

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణ శిఖర ప్రతిష్ట ఆదివారం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలకుడు కాశీ విశ్వేశ్వర స్వామి, గోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణకలశ ప్రతిష్ట జరిగింది. కార్యక్రమాలు ఎంఎల్ఎ చిర్ల జగ్గి రెడ్డి సహకారంతో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ భూపతి రాజు వెంకట సత్య కిషోర్ కుమార్, ధర్మకర్తల మండల సభ్యులు వెంకటేశ్వరరావు శన గన సత్యనారాయణ ఉపసర్పంచ్ పోతు రాజుబాబురావు పాల్గొన్నారు.

ముమ్మిడివరం రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా రామకృష్ణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా దడాల రామకష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం.రుషి తెలిపారు.

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో ఆదివారం జ్ఞాన ప్రకాష్ అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రుషి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేఆద్కర్ చే స్వయంగా స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సిద్ధాంతాలను, అశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఉన్నత విద్యావంతుడు,విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ దడాల రామకష్ణ ను నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. రామకష్ణ గెలుపుకు కార్యకర్తలంతా సమిష్టిగా కషి చేయాలని సమావేశం తీర్మానించింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బళ్ల సత్యనారాయణ, పెనుమాల సుధీర్, సఖీలే పథ్వీరాజ్, మోకా బాలయ్య, చికురుమీల్లి చిరంజీవి, ఇవివి.సత్యనారాయణ, యలమంచిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి అర్బన్, డోర్ నెంబర్ 73-8-12/2b, రావిపాటి కొండల రావు వీధి, సత్తెమ్మ తల్లి గుడి, నారాయణపురం లో నివాసం ఉంటున్న **మద్దినేని వీర రాఘవయ్య** గారి భార్య **మద్దినేని లోకేశ్వరి @ గుదే లోకేశ్వరి,** (age 41 yrs) అను నేను ది. 14-03-2024న మద్యాహ్నం 01.30 ని.లకు రాజమండ్రి లోని V.L.పురం నుండి రామాలయం సెంటరు మద్యలో జిరాక్స్ తీసుకొనుటకు జిరాక్స్ షాప్ దగ్గరకు వెళ్తుండగా బయట రోడ్ మీద నా ఆస్తికి సంబందించిన లింక్ దస్తావేజు ఉన్న బిస్కెట్ రంగు జిప్ బాగ్ పడిపోయినది. రోడ్ దాటేముందు బాగ్ నా దగ్గరే వుంది కానీ షాప్ దగ్గరకు వెళ్ళి చూసే సరికి లేదు. అందులో నా ఆస్తికి సంబందించిన ఒరిజినల్ లింక్ దస్తావేజు ఉన్నది. ఆ దస్తావేజు నెంబర్ 1297/1984, తేది.27-2-1984, SRO, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లాకు సంబందించినది ఉన్నది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రెస్ కు తెలియపరచవలసినదిగా కోరుచున్నాను.

Maddineni Lokeswari @ Gude Lokeswari,
W/o.Maddineni Veera Raghavayya,
Door No.73- 8-12/2b, Ravipati Kondalara Rao Street, Sattemmatalli Gudi, Narayana puram,
Rajamahendravaram Urban,
East Godavari Dist. Cell: 9866605444.

యానాం వార్తలు

మునిస్వామితో మాట్లాడుతున్న వైద్యనాథన్, సత్తిబాబు, దినేష్

తాగు, సాగి నీటి సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - యానాం

రైతులకు, ప్రజలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామిని పుదుచ్చేరి సిఎల్‌పి నేత, ఎంఎల్ఎ వైద్యనాథన్ కోరారు. ఆదివారం స్థానిక కనకాలపేటలోని డంపింగ్ యార్డ్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురీ విభాగం, సిటీ స్కానింగ్ ఎక్స్‌రే, జనరేటరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే గోపాల్ నగర్‌లో ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ స్థలంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యానాం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, కాటంశెట్టి రామ్మూర్తి, కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్దాని దినేష్, పెరిమాళ్, దున్నా చక్రవర్తి, బంగారం, మున్నా, గణేష్ పాల్గొన్నారు.

36 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మునిస్వామి

ప్రజాశక్తి - యానాం

ఏప్రియల్ 19న జరిగే లోక్ సభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి యానాంలో 3 మోడల్ పోలింగ్ బూత్‌లతో కలిపి 36 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో స్త్రీ, పురుషులు కలిపి మొత్తం గా 39 వేల 400 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం ప్రైమరీ పాఠశాలలో(తూర్పు వైపు) మోడల్ పోలింగ్ బూత్‌ను మహిళలు నిర్వహిస్తారన్నారు. అలాగే అంబేడ్కర్ నగర్‌లోని దున్నా నాగారావు ప్రభుత్వ పాఠశాలలో(ఉత్తరం వైపు) పోలింగ్ బూత్‌ను యువత నిర్వహిస్తారన్నారు. అలాగే స్థానిక మినీ సివిల్ స్టేషన్ లోని పోలింగ్ బూత్(తూర్పు వైపు)ను వికలాంగులు నిర్వహిస్తారన్నారు. మూడు ఫ్లైయింగ్ తనిఖీ బృందాలను, అలాగే వీడియో నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సెల్ సెక్రటరీగా జానీ మోసెస్

జానీ మోజేష్‌ను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర సెక్రటరీగా సామర్లకోట పట్టణానికి చెందిన మైలాభత్తుల జానీ మోజెష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని దొరబాబును ఆయన కోరారు. ఈ సందర్భంగా జానీ మోసెస్‌ను దొరబాబు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లింకు దస్తావేజు వడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, ఉండూరు గ్రామం, రామారావుపేట, డోర్ నెం.4-105కు చెందిన యాండ్రపు జోగారావు (లేటు) గారి భార్య యాండ్రపు అప్పలరాజు వల్లీ పద్మ కు చెందిన మండలంలోని ఉండూరు గ్రామంలో సర్వే నెం.118/1, వార్డు నెం.4లో ప్లాటు నెం.7 లో 97 చ.గ.లు కు చెందిన ఖాళీ స్థలంకు చెందిన ఒరిజనల్ లింకు దస్తావేజు నెం. 776/1988 ది. 29.02.2024 నాడు సామర్లకోట లో జిరాక్సు తీయించుకొనుటకు వెడుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల క్రింది చిరునామాకు అందచేయమని కోరుతున్నాను.

యాండ్రపు అప్పలరాజు వల్లీ పద్మ, వై/ం.జోగారావు (లేటు),
డోర్ నెం. 4- 105,ఉండూరు గ్రామం,
సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా
సెల్ : 9640 417711.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(A Government undertaking sponsored by Union Bank of India)
డో.నెం. 6-418, అరవింద్ నగర్, మోరంపూడి, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా

మోరంపూడి శాఖ - బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా శాఖలో తీసుకున్న ఋణములు ఎన్ని విధములుగా మీకు సమాచారం పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణం చెల్లించవలసిన కాలం గడిచినందున ప్రధాన కార్యాలయం వారి ఉత్తర్వుల మేరకు సదరు బంగారు నగలను **ది. 27-03-2024 బుధవారం మ॥ గం॥ 3.00లకు** ఈ మోరంపూడి శాఖ ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరునున్న బకాయిలు జమ కట్టుకొనుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొనదలచినవారు **ది. 27-03-2024 మ॥ గం॥ 1.00 లోపు రూ. 5,000/- అడ్వాన్సుగా చెల్లించవలయును.** ఎట్టి కారణము చూపకనే వేలమును రద్దు చేయుట గాని, వాయిదా వేయుట గాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. వేలం వేసిన బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. మరియు వేలం తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈదిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం వర్తిస్తుంది. నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరిగా తెలియజేయడమైనది.

మోరంపూడి శాఖ, తూర్పుగోదావరి జిల్లా, వేలం తేది: 27-03-2024 సమయం గం॥ 3.00లకు

క్ర.సం.	అప్పు ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు, చిరునామా	నికర తూకం గ్రా॥
1.	718030100050516	వడ్డి రాజేష్, R/o. మోరంపూడి	9.0
2.	718030100051542	వడ్డి రాజేష్, R/o. మోరంపూడి	7.0
3.	718030100061424	నగుమల్లి శివప్రియ, R/o. మోరంపూడి	3.0
4.	718030100061433	శృంగవరపు రమేష్, R/o. మోరంపూడి	3.6
5.	718030100061488	గెద్దం ప్రసాద్, R/o. పిడింగొయ్యి	1.8
6.	718030100066304	నగుమల్లి శివప్రియ, R/o. మోరంపూడి	12.0

మోరంపూడి
17-03-2024
బ్రాంచి మేనేజర్
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, మోరంపూడి, సెల్: 9100903271